క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ శాంతినగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు జరుగుతున్నందున మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు శాంతినగర్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి



పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు చదువుతో పాటు ఆటల పోటీల్లోనూ రాణించాలని విజయవాడ నార్త్ మండల విద్యాశాఖాధికారి ఎ.వెంకటరత్నం సూచించారు. 63వ డివిజన్ రాజీవ్‌నగర్ ఎలిమెంటరీ స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఆటల పోటీల్లో విజేతలకు సోమవారం ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి స్కూల్‌కి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం వి.ప్రమీలారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక మాచవరం మహాత్మాగాంధీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సోమవారం 'ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే' ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్‌కే షమీలాపర్వీన్ మాట్లాడుతూ చిన్నారులంతా తాము ఎంచుకున్న రంగాల్లో ప్రతిభ కనబరచి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం 45 మంది చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హిందీ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ చారులత, హిందీ కాలేజీ పీజీ డిపార్ట్‌మెంట్ సభ్యురాలు బల్వీందర్ కౌర్, స్కూల్ ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

25న స్వరఝరి వార్షికోత్సవం

విజయవాడకల్చరల్: స్వరఝరి సంగీత సేవా సంస్థ 36వ వార్షికోత్సవాన్ని 25వ తేదీ గురువారం సాయంత్రం దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి మోదుమూడి సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత విద్వాంసుడు శ్రీమాన్ కొమాండూరి శేషాద్రికి చింతలపాటి రాజ్యలక్ష్మి స్మారక వార్షిక పురస్కారం, మృదంగ విద్వాంసురాలు దండమూడి సుమతీ రామ్మోహనరావుకు లయ ప్రవీణ పురస్కారం ప్రదానం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా కొమాండూరి శేషాద్రి, అనంత శౌరిరాజన్, వెంకటకృష్ణల వాయిలీన త్రయం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏకగ్రీవంగా చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ కార్యవర్గం



మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా తాళ్లూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా అల్లూరి శ్రీధర్ రెడ్డి, మిక్కిలి యేషయ్య బాబు, నిక్కు రవికుమార్, సహాయ కార్యదర్శిగా వి.శ్రీనివాసరావు, బోని సురేష్‌కుమార్, అక్కి సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా ఈశ్వరరావు ఎన్నికయ్యారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షురాలు వెనిగళ్ల అమ్మాజీ అధ్యక్షతన అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దేవినేని కిషోర్‌కుమార్ నూతన కార్యవర్గం సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బడ్జెట్ పాఠశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తామని చెప్పారు.

సొమ్ము విషయమై ఘర్షణ

పెనమలూరు: యనమలకుదురులో ఇద్దరు వ్యక్తుల మధ్య సొమ్ము విషయమై తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీయడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన జి.శ్రీనివాసరెడ్డి అదే గ్రామానికి చెందిన మైలా శ్రీనివాసరావు గతంలో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. అయితే శ్రీనివాసరెడ్డి రూ. 2.65 లక్షలు కారు కొనడానికి శ్రీనివాసరావుకు ఇచ్చాడు. వారి మధ్య విభేదాలు రావడంతో ఇరువురు విడిపోయారు. వీరిద్దరు యనమలకుదురు లాకుల వద్ద ఎదురుపడగా సొమ్ము విషయమై తగాదా పడి పరస్పరం దాడి చేసుకున్నారు. అందిన ఫిర్యాదుల మేరకు పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

అట్టహాసంగా 'వెలంపల్లి' నామినేషన్

- సత్యనారాయణపురం శివాలయంలో ప్రత్యేక పూజలు
- అక్కడ నుంచి ర్యాలీగా నామినేషన్‌కు వెళ్లిన వెలంపల్లి
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



నామినేషన్ దాఖలు చేస్తున్న సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి, పక్కన ఎమ్మెల్యే విష్ణు, ఎమ్మెల్సీ రుహుల్లా



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి



ర్యాలీలో పాల్గొన్న వెలంపల్లి కుటుంబ సభ్యులు

గాంధీనగర్, సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): విజయవాడ సెంట్రల్ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెలంపల్లి శ్రీనివాసరావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. తొలుత కుటుంబ సభ్యులతో కలిసి సత్యనారాయణపురంలోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, కుటుంబ సభ్యులతో కలిసి ర్యాలీగా నామినేషన్‌కు బయలుదేరారు. దారి పొడవునా వెలంపల్లికి బ్రహ్మరథం పట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, వై నాట్ 175 అంటూ పెద్దపెత్తున నినాదాలు చేశారు. మహిళలు గుమ్మడికాయలతో దిష్టి తీశారు. అలంకార్ సెంటర్‌లో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా సోదరులు యాపిల్స్, పూలతో చేసిన గజ మాల వేశారు. ఈ సెంటర్‌లో వెలంపల్లి గుర్రపు బగ్గీపై ఎక్కి తల్వార్ దూశారు. అక్కడ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి కంట్రోల్ రూం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి వన్‌టౌన్ కెనాల్ రోడ్డులోని వినాయక ఆలయానికి చేరుకున్నారు. ఉదయం 10.48 గంటలకు తన నామినేషన్ పత్రాలను వినాయకుడి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి వీఎంసీ కార్యాలయంలోని సెంట్రల్ నియోజకవర్గ రిటర్నింగ్ కార్యాలయంలో వెలంపల్లి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఆర్వో, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సమర్పించారు.

భారీ ర్యాలీ సాగిందిలా..

సత్యనారాయణపురం శివాజీ కేఫ్ వద్ద ప్రారంభమైన ర్యాలీ బీఆర్‌టీఎస్ రోడ్డు శారదా కళాశాల జంక్షన్, గాంధీనగర్ ఎస్‌ఆర్‌పీ రోడ్డు, శాంతి ప్రశాంతి, ఎన్జీఓ కార్యాలయం రోడ్డు, సాంబమూర్తి రోడ్డు, అలంకార్ సెంటర్, లెనిన్ సెంటర్, ఏలూరు రోడ్డు రాజ్ టవర్స్, అప్సర థియేటర్, చల్లపల్లి బంగ్లా, పాత బస్టాండ్, బందరు రోడ్డు మీదుగా కంట్రోల్ రూం వరకు సాగింది. బంజారా నృత్యం, డప్పు వాయిద్యాలు మేళ తాళాలు, డీజేతో ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. టాల్ బాయ్స్ విన్యాసాలు, ఫ్లాష్ మాబ్ ఈవెంట్స్ ఆకట్టుకున్నాయి.

బొండా ఉమాను ఓడించడం ఖాయం..

కంట్రోల్ రూం వద్ద ర్యాలీ ముగిసిన అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కేశినేని నాని భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'టీడీపీ అభ్యర్థి బొండా ఉమాకు నామినేషన్ వేసేందుకు మనుషులు లేని పరిస్థితి దాపురించిందని అన్నారు. బొండా ఉమా, ఆయన తనయుడు తప్ప నాయకులు ఎవరూ లేరన్నారు. నియోజకవర్గంలో బొండా ఎంతో మందిని మోసం చేశాడని ఆరోపించారు. రౌడీయిజం, గుండాయిజంతో స్థలాలు కబ్జా చేశాడన్నారు. ఉమా కాల్‌మనీ సెక్స్ రాకెట్ కేసుల్లో ఉన్నాడని పేర్కొన్నారు. ఇటీవల సీఎం జగన్‌పై దాడి చేయించాడని ఆరోపించారు. అటువంటి వ్యక్తికి విజయవాడ సెంట్రల్‌లో ఓటు అడిగే హక్కు లేదన్నారు. ఈ ఎన్నికల్లో బొండా ఉమాను ఓడించడం ఖాయమని వెలంపల్లి ధీమా వ్యక్తం చేశారు. నామినేషన్ కార్యక్రమంలో అడుగడుగున ప్రజలు తనను ఆశీర్వదించారని తెలిపారు. నామినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శైలజ, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



సింగ్‌నగర్ నుంచి నామినేషన్‌కు వెళ్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



61వ డివిజన్ నుంచి వెలంపల్లి నామినేషన్‌కు వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు నామినేషన్ కార్యక్రమానికి సోమవారం సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ, నందమూరినగర్ పరిసర ప్రాంతాల నుంచి పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. దీంతో ఇక్కడి రహదారులన్నీ వైఎస్సార్ సీపీ జెండాలతో కళకళలాడుతూ కనిపించాయి.

పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు నామినేషన్ కార్యక్రమానికి పలు డివిజన్ల నుంచి పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వెళ్లారు. 61వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, నాయకులు పార్టీ జెండాలను చేతపట్టుకొని సత్యనారాయణపురం శివాజీకేఫ్ వద్దకు ర్యాలీగా వెళ్లారు. 62వ డివిజన్ నుంచి వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వెళ్లారు. 63, 64వ డివిజన్ల కార్పొరేటర్లు మోదుగుల గణేష్, యరగొర్ల తిరుపతమ్మ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నామినేషన్‌కు తరలివెళ్లారు.

నేడు 64వ డివిజన్‌లో వెలంపల్లి పర్యటన

పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి 64వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా గడప గడపకు పర్యటిస్తారని నియోజకవర్గ పార్టీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, పార్టీ నాయకులు పాల్గొంటారని తెలిపింది.

టీడీపీ, జనసేన, బీజేపీలను తరిమికొట్టాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): అధికారంలో ఉండగా ప్రజలను పట్టించుకోని టీడీపీ, బీజేపీ, జనసేనలను తరిమి కొట్టాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి పిలుపునిచ్చారు. స్థానిక 27వ డివిజన్ బావాజీపేటలో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కే రాము, భవానీరెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆదిశంకరుల జయంతి ఉత్సవాలు

విజయవాడకల్చరల్: జగద్గురువులు ఆదిశంకరుల జయంతి ఉత్సవాలను శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో బుధవారం నుంచి 20 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు క్షేత్ర ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయంలో ప్రతిరోజూ పంచామృత అభిషేకం, అర్చన, అష్టోతర శతనామార్చన నిర్వహిస్తామని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రస్థానత్రయ భాష్యం అంశంగా ప్రసంగిస్తారని తెలిపారు.

పది ఫలితాల్లో మెరిసిన విద్యా కుసుమాలు

- సాధారణ విద్యార్థులు.. అసాధారణ ఫలితాలు
- కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా ఉత్తీర్ణత



శ్యామ్‌శరత్ బాబు(589)



వి.ధాత్రిశ్రీలక్ష్మి 583 మార్కులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పదో తరగతి పరీక్షల్లో నగరపాలకసంస్థ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలు సాధించారు. ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. ప్రభుత్వ చర్యలు పదో తరగతి ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది. దుర్గాపురం ఎస్‌టీపీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో డి.భవానీశంకర్ 594 మార్కులతో ప్రథమ స్థానం, కె.నవనీత్ 570 ద్వితీయ, సాయి 567 తృతీయ స్థానం సాధించారు. పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు పొందిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం సూర్యప్రభ, సిబ్బంది అభినందించారు. అలాగే ముత్యాలంపాడు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు నగరపాలకసంస్థ పాఠశాలలో 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎల్.దుర్గాప్రసన్న 563 మార్కులతో ప్రథమ, బ్యూలా ఎమరాల్డ్ 554 ద్వితీయ, ఎం.నాగ శృతి భాను జయలక్ష్మి 536 తృతీయ స్థానం సాధించారు. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం జె.పుష్పలత అభినందించారు.

పాయకాపురం(విజయవాడరూరల్): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. 64వ డివిజన్ బీవీ సుబ్బారెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో వి.ధాత్రి శ్రీలక్ష్మి 583 మార్కులు సాధించి స్కూల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. పి.కరుణజ్యోతి, ఎం.నాగనిఖితలు 567 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో ఎల్.భాగ్యలక్ష్మి 569 మార్కులు సాధించింది. రాజీవ్ గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇల్లా చరణ్‌తేజ 567 మార్కులతో స్కూల్ ప్రథమస్థానంలో నిలిచాడు. ఇంగ్లీషు మీడియంలో 37 మంది విద్యార్థులకు గాను 35 మంది ఉత్తీర్ణులైనట్లు హెచ్ఎం పి.శ్రీనివాసరావు తెలిపారు.

మున్సిపల్ పాఠశాలల్లో మెరిసిన విద్యార్థులు

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లోని 29 మున్సిపల్ స్కూల్ నుంచి మొత్తం 2,621 మంది విద్యార్థులు హాజరవ్వగా అందులో 2,121(80 శాతం)మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పటమట వించిపేటలోని ఎస్ఎస్ఎంసీ బాలికల ఉర్దూ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఐదు పాఠశాలల్లో 90కు పైగా ఉత్తీర్ణత సాధించారు. పది పాఠశాలల్లో 80, 11 పాఠశాలల్లో 70, రెండు పాఠశాలల్లో 60, ఒక పాఠశాలలో 50 శాతాలకు పైగా ఉత్తీర్ణత సాధించారు.

ఏకేటీపీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పదో తరగతి ఫలితాల్లో సత్యనారాయణపురంలోని ఏకేటీపీఎం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పాఠశాలలో 68 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు తెచ్చుకుని తమ ప్రతిభను కనబరిచారు. శ్యామ్‌శరత్‌బాబు 589 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలవగా టి.సాయికార్తీక్ 579, సాయిరేఖ 573 ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఘనంగా మరకత శివలింగ వాయు ప్రతిష్ఠ మహోత్సవాలు



మరకత శివలింగ వాయు ప్రతిష్ఠ మహోత్సవాల్లో డాక్టర్ గౌతంరెడ్డి దంపతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం మరకత శివలింగ వాయు ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకు గోపూజతో ప్రతిష్ఠ మహోత్సవాలు ఆరంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణలతో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు ఆలయ ప్రదక్షిణ, అదిష్టాన దేవతల అనుజ్ఞ, శ్రీ మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన, దీక్షావస్త్రధారణ, కలశస్థాపనలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు సాయంకాల మండప పూజలు, విగ్రహాలకు జలాధివాసం జరిగింది. కార్యక్రమాలను ఆలయకమిటీ కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా మల్లేశ్వరుని కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం(పాత శివాలయం)లో స్వామివారి కల్యాణోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్ర సహిత కల్యాణ పుష్పయాగ మహోత్సవంలో భాగంగా ఆలయంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నిత్య ఓపాసన, బలిహరణ, జగ జ్యోతి ప్రతిష్టాపన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని కల్యాణ వేదికపై స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రాచకొండ సుమంత్ శర్మ, రాచకొండ నాగరాజు శర్మలు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరు సురేష్‌బాబు పర్యవేక్షించారు.

సందడిగా ఎంపీ కేశినేని నాని నామినేషన్

- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు
- చంద్రబాబు పెద్ద మోసకారి, అమరావతి బడా స్కామ్



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ కేశినేని నాని, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థులు

విజయవాడస్పోర్ట్స్/వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) నామినేషన్ సోమవారం అట్టహాసంగా జరిగింది. ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా హాజరుకావడంతో నామినేషన్ పర్వం కోలాహలంగా సాగింది. విజయవాడ వెస్ట్, తిరువూరు, జగ్గయ్యపేట, మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థులు షేక్ ఆసిఫ్, నల్లగట్ల స్వామిదాస్, సామినేని ఉదయభాను, సర్నాల తిరుపతిరావుయాదవ్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మితో పాటు కేశినేని నాని భార్య పావని, కుమార్తెలు శ్వేత, హేమ, అల్లుళ్లు పృథ్వీ, రఘు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఉత్సాహంగా ర్యాలీ..

ఉదయమే.. కేశినేని నాని కుటుంబ సభ్యులతో కలిసి పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంద్రకీలాద్రి నుంచి నిర్వహించిన ప్రత్యేక ర్యాలీలో వైఎస్సార్ సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కెనాల్ రోడ్డు, తుమ్మలపల్లి కళాక్షేత్రం, పాత కంట్రోల్ రూం, ఏలూరు రోడ్డు, మ్యూజియం రోడ్డు మీదుగా బందరు రోడ్డులోని కలెక్టరేట్‌కు ఈ ర్యాలీ చేరుకుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ ర్యాలీ మధ్యాహ్నం 1.15 గంటల వరకు కొనసాగింది. దారి పొడవునా అభిమానులు గజ మాలలు ఏర్పాటు చేసి ఘనంగా స్వాగతం పలికారు. హిందూ, క్రిస్టియన్, ముస్లిం, సిక్కు మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీస్సులందించారు. పలువురు మహిళా కార్యకర్తలు హారతులు పట్టారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి కేశినేని నాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ, దళిత సంఘాల నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు భారీగా ర్యాలీలో పాల్గొనడంతో సుమారు రెండు కిలోమీటర్ల ర్యాలీ మూడు గంటల పాటు కొనసాగింది. ర్యాలీ కారణంగా ట్రాఫిక్ స్తంభించకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

ఆకట్టుకున్న గిరిజన నృత్యాలు

ర్యాలీలో ఎ.కొండూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ ముందు బిందెలతో సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఎంపీగా కేశినేని నాని విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని ఆశీర్వదించారు. గిరిజన వేషధారణలో తలపై బిందెలతో లయబద్ధంగా నృత్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్న ఈ బృందాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి నాగేంద్రపుణ్యశీల, ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్ తదితరులతో పాటు జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజన పాలన అందించిన సీఎం జగన్



హారతులు ఇస్తున్న మహిళలు

58 నెలల వైఎస్సార్ సీపీ పాలనలో సీఎం జగన్ ప్రజలకు ఏం కావాలో.. అదే అందించారని కేశినేని నాని అన్నారు. నామినేషన్ పర్వం ముగిసిన అనంతరం కలెక్టర్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రమంతటా గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి పాలనను ప్రజల చెంతలు తీసుకొచ్చామన్నారు. వలంటీరు వ్యవస్థతో ప్రజలకు మేలైన సేవలు అందించామని చెప్పారు. గ్రామ, పట్టణ, నగరాల్లో ప్రతి రెండు వేల మందికి ఒక క్లినిక్‌ను ఏర్పాటు చేసి వైద్య నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి వైద్య రంగం అభివృద్ధికి తోడ్పాటు అందించామని తెలిపారు. వేల కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ బడుల రూపు రేఖల మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. 2014లోనూ ఇదే మాదిరిగా జనసేన, బీజేపీతో కలిసి చంద్రబాబు పోటీ చేశారని, 650 హామీలను ఇచ్చి ప్రజలను నిలువునా ముంచాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు. చంద్రబాబు విశ్వసనీయత కోల్పోయాడని, విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కార్పొరేటర్‌గా సైతం పోటీ చేసేందుకు అర్హత లేనివాడన్నారు. ఒక కార్పొరేటర్‌కు వచ్చిన ఓట్లు మాత్రమే టీడీపీ ఎంపీ అభ్యర్థికి పడతాయని ఎద్దేవా చేశారు. 2024 ఎన్నికల అనంతరం టీడీపీకి తాళం పడిడన్నారు. 2019 ఎన్నికల్లో నవరత్నాలతో పాటు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. అందుకే ఎంతో ధైర్యంతో మీ ఇంట్లో మంచి జరిగితేనే ఓటేయ్యమని సీఎం జగన్ జగన్ ప్రజలను అడుగుతున్నాడని తెలిపారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రకృతిని పరిరక్షించడం అందరి బాధ్యత అని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ అన్నారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ పీఎస్‌సీఎంఆర్, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ, పలు అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భూమిని కాపాడుకోవడం ద్వారా సంతోషకరమైన ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలమన్నారు. మానవ జీవన విధానంలో ప్లాస్టిక్ వాడకం అధికమైందని చెప్పారు. అలాగే సుఖవంతమైన, విలాసజీవనానికి అలవాటు పడిన ప్రజలు ఆయా వస్తువుల ద్వారా అనేక వ్యర్థాలు, వాయువులను విడుదల చేయడం భూమికి చాలా ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయన్నారు. వీటిపై సమాజాన్ని జాగృతం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని పేర్కొన్నారు. అధ్యాపకులు డాక్టర్ పి.నరేష్, బి.శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ ఏ.రమాదేవి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.